సినిమా





● ఉగాది స్పెషల్

పచ్చడి తింటాం.. చేయడం రాదు

- శివాని, శివాత్మిక

హైదరాబాద్‌లో ఉంటే అమ్మ, నాన్న, మేమిద్దరం కలిసి పండగ జరుపుకుంటాం. అమ్మ ఉగాది పచ్చడి, గారెలు, పులిహోర, పాయసం .. ఇలా అన్నీ చేస్తుంది. ఒకవేళ మేం చెన్నైలో ఉంటే... అక్కడి మా బంధువులతో పండగ జరుపుకుంటాం. మా ఇద్దరికీ పచ్చడి తినడం తప్ప చేయడం రాదు. మా చిన్నప్పుడు ఇద్దరం ముగ్గులు వేసేవాళ్లం. పండగ అంటే మాకు ముగ్గులే ఎగ్జయిటింగ్. ఇక పండగ రోజున కొత్త బట్టలంటే అది ఆ రోజు మూడ్‌ని బట్టి ఉంటుంది. ఒక్కోసారి ఫుల్ ట్రెడిషనల్‌గా డ్రెస్ చేసుకుంటాం.. చక్కగా నగలు పెట్టుకుని గుడికి వెళతాం. చీర, లంగా, ఓణీ, చుడీదార్.. ఇలా ఏదో ఒకటి ప్రిఫర్ చేస్తాం. ఇప్పుడు చెన్నైలో ఉన్నాం. ఈసారి ఫుల్ ట్రెడిషనల్‌గా రెడీ అవుతాం. ఈ ఉగాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని కోరుకుంటూ.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.

ఇంకా మంచి ఆర్టిస్ట్‌గా గుర్తింపు సంపాదించుకోవాలనుకుంటున్నాను. ఇంకా మంచి నటిగా ఎదగాలని ఉంది. అలాగే మంచి డాక్టర్ అవ్వాలన్నది లక్ష్యం. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ మెడిసన్ చేస్తున్నాను. ఏం చేసినా నిబద్ధతతో చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. వర్కవుట్, మాటింగ్, చదువు, హార్స్ రైడింగ్.. ఏదైనా మరింత క్రమశిక్షణగా చేయాలనుకుంటున్నాను.
- శివాని

ఈ సంవత్సరం చేతినిండా పని ఉండాలని కోరుకుంటున్నాను. తెలుగు, తమిళంలో సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాగే ఇతర భాషల్లోనూ అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను. కెరీర్‌పరంగా ఎదగాలన్నదే ప్రస్తుత లక్ష్యం. వీలైతే ఏదైనా స్పోర్ట్ నేర్చుకోవాలని ఉంది. ఏడాది మొత్తం చాలా ప్రశాంతంగా గడిచిపోవాలని ఉంది. ఆరోగ్యం బాగుండాలి.
- శివాత్మిక

ఇది స్టన్నింగ్ షో - రాజమౌళి

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్). ఈ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దీంతో 'నాటు నాటు' పాపులారిటీ మరింత పెరిగిపోయింది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నార్త్ అమెరికన్ సీమాంధ్ర అసోసియేషన్ సభ్యులు వంశీ కొప్పు రావూరి, ఉజ్వల్ కుమార్ కస్తల న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో గల పాపియోనా పార్క్‌లో 'నాటు నాటు' పాటకు 150 టెస్లా కార్లతో లైట్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిసన్ నగర మేయర్ సామ్ జోషి, ఆయన బృందం సహకరించారు. ''నాటు నాటు' లైట్ షో సంతోషానిచ్చింది. ఈ షోకు అసోసియేట్ అయిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది స్టన్నింగ్ షో'' అని రాజమౌళి ట్వీట్ చేశారు.


● 'నాటు నాటు' లైట్ షో


● చిరంజీవి, కీర్తీ సురేష్, తమన్నా

భోళా శంకర్ రాక అప్పుడే...

ఉగాదికి ఫ్యాన్స్‌లో పండగ జోష్ నింపారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. హీరో సుశాంత్ ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. కాగా 'భోళా శంకర్' సినిమాను ఆగస్టు 11న రిలీజ్ చేయనున్నట్లు ఉగాది సందర్భంగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి.

మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు

- కోట శ్రీనివాసరావు



''జీవితంలో డబ్బు సంపాదించటానికి చండాలపు పనులు బోలెడున్నాయి.. తప్పుడు వార్తలు రాయక్కర్లేదు. మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు. నేను క్షేమంగానే ఉన్నాను'' అని సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. ''అందరికీ ఉగాది శుభాకాంక్షలు. కోట శ్రీనివాసరావు దుర్మరణం అని సోషల్ మీడియాలో వార్త వేశారట. అలాంటి వార్తల గురించి నాకు తెలియదు. ఉగాది పండగ ఎలా చేయాలి? ఏంటి అనుకుంటుంటే ఉదయం 7:30 గంటల నుంచి ఒక్కటే ఫోన్లు. స్వయంగా యాభై కాల్స్ మాట్లాడాను. బందోబస్తు కోసమని ఓ పదిమంది పోలీసులు నా ఇంటివద్దకు రావడం ఆశ్చర్యంగా అనిపించింది. 'మీరు పెద్దాయన, అందరికీ తెలిసినవారు కదా.. పెద్ద పెద్దవాళ్లు మిమ్మల్ని చూసేందుకు వస్తారని బందోబస్తు కోసం వచ్చాం' అన్నారు. 'ఇలాంటి తప్పుడు వార్తలు రాకుండా దయచేసి మీరే చర్యలు తీసుకోండి, అరికట్టండి.. ఎందుకంటే ఎవరైనా పెద్దవాళ్లు ఉంటే గుండె ఆగి చస్తారు' అని వాళ్లకు చెప్పి పంపించాను. ఇలాంటి తప్పుడు వార్తలు మీరు (ప్రజలు) నమ్మవద్దని మనవి చేస్తున్నాను. అలాగే తప్పుడు వార్తలు రాసే వారిపై ప్రజలు కూడా తిరగబడితే వారికి బుద్ధి వస్తుంది'' అన్నారు కోట శ్రీనివాసరావు.

ఆయన నటనలోని మ్యాజిక్‌ని చూశా!

- ప్రకాశ్‌రాజ్


● కృష్ణవంశీ, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వంలో కాలిపు మధు, ఎస్. వెంకట్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ– ''మరాఠీ 'నటసామ్రాట్' సినిమా చూశాక ఒక కళాకారుడి జీవితంలో ఉన్న బరువు నాకు అర్థం అయింది. ఇలాంటి కథను నేను చూపించాలని అనుకున్నాను. 'నటసామ్రాట్' గురించి కృష్ణవంశీకి చెప్పగానే బాగుందన్నాడు. ఎమోషన్స్ చక్కగా ప్రెజెంట్ చేయగలడని తనని ఈ సినిమా రీమేక్ 'రంగ మార్తాండ'కు దర్శకత్వం వహించమని కోరాను. బ్రహ్మానందంగారితో కలిసి వర్క్ చేయడం వల్ల ఆయన నటనలోని మ్యాజిక్‌ను చూసే అవకాశం దొరికింది'' అన్నారు. ''ప్రకాశ్‌రాజ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. ఎన్నో సినిమాల్లో నటించిన అనుభవం ఉన్న అద్భుత నటులు బ్రహ్మానందం ఈ సినిమా కోసం కొత్త ఆర్టిస్టులా నటించారు'' అన్నారు కృష్ణవంశీ. 'ఈ చిత్రం క్లయిమాక్స్‌లో ప్రకాశ్‌రాజ్ నట విశ్వరూపం చూస్తారు. ప్రతి సీన్‌ని కృష్ణవంశీ చక్కగా తెరకెక్కించారు'' అన్నారు బ్రహ్మానందం.

ఓ బేబీ జారిపోమాకే...


● కిరణ్, అతుల్య

'హే అందమెట్టి కొట్టావే.. అందనంటూ పోతావే.. గుండెలోన నీ బొమ్మే పెట్టా చూడవే' అంటూ ప్రేయసి కోసం కిరణ్ అబ్బవరం పాట పాడారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమాలోని 'ఓ బేబీ జారిపోమాకే..' అంటూ సాగే లిరికల్ వీడియోను దర్శకుడు అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. సాయి కార్తీక్ స్వరపరచిన ఈ పాటకు బాలాజీ సాహిత్యం అందించగా ధనుంజయ్ పాడారు.

కథ వెనుక కథేంటి?

విశ్వంత్ దుద్దుంపూడి హీరోగా, శ్రీజిత గొష్, శుభశ్రీ హీరోయిన్లుగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'కథ వెనుక కథ'. సునీల్, అలీ కీలక పాత్రలు చేశారు. అవనీంద్ర కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ''నా కెరీర్‌లో ఇదొక ప్రయోగాత్మక చిత్రం'' అన్నారు విశ్వంత్. ''భవిష్యత్తులోనూ మా బ్యానర్‌లో కొత్తవారిని ప్రోత్సహిస్తూ సినిమాలు చేస్తాం'' అన్నారు అవనీంద్ర కుమార్. ''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు కృష్ణ చైతన్య. ''నిర్మాతలు బావుంటే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి'' అన్నారు అలీ. ''అవనీంద్రలాంటి నిర్మాత దొరకటం కృష్ణ చైతన్య అదృష్టం'' అన్నారు సునీల్.


● సునీల్, విశ్వంత్, అలీ

ఆ భయం లేదు!


● ఫరియా

''నటిగా నా జర్నీపై నాకో స్పష్టత ఉంది. అందుకే సినిమాల ఎంపిక విషయంలో నాకు తొందరపాటు లేదు. చాన్స్‌లు వస్తాయా? రావా అనే భయం కూడా లేదు'' అన్నారు ఫరియా అబ్దుల్లా. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. రవితేజ, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో లాయర్ కనకమహాలక్ష్మి పాత్ర చేశాను. అయితే 'జాతి రత్నాలు'లో చేసిన కామెడీ లాయర్‌లాంటి పాత్ర కాదు. కనకమహాలక్ష్మి సీరియస్‌గా ఉంటుంది. రవితేజగారు నాకు సీనియర్ లాయర్. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నాను'' అన్నారు.

ఆ నమ్మకంతో రిస్క్ చేశాను - విశ్వక్ సేన్

''నేను సినిమాలు చేస్తున్నది డబ్బులు సంపాదించుకోవడానికి కాదు.. సినిమాలు తీయడానికే. 'ధమ్కీ' సినిమాకు చాలా ఖర్చు పెట్టాను. నటనతో పాటు నిర్మాణం, దర్శకత్వం అంశాల్లోనూ చాలా నిజాయితీగా పని చేశాను. ప్రేక్షకులపై నమ్మకంతో చాలా రిస్క్‌లు తీసుకుని నేను చేసిన ఈ సినిమా నా జీవితాన్ని మార్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాలోని సెకండాఫ్‌ను విశ్వక్ మాత్రమే తీయగలడు అనేలా ఉంటుంది. మా నాన్న నన్నెంతో భరించారు. ఆయనకు ఈ సినిమా డబ్బులు తీసుకుని రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు నటుడు, దర్శక–నిర్మాత విశ్వక్ సేన్. ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. కరాటే రాజు (విశ్వక్‌సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో 'కరాటే' రాజు మాట్లాడుతూ– ''బడ్జెట్ మూడింతలు పెరిగినా క్వాలిటీ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.


● 'కరాటే' రాజు, నివేద, విశ్వక్ సేన్

పబ్లిసిటీ ఇన్‌చార్జ్ ప్రమోద్ కుమార్ ఇక లేరు



తెలుగు పరిశ్రమలో ఎన్నో చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా చేసిన వీరమాచనేని ప్రమోద్ కుమార్ (87) మంగళవారం విజయవాడలో కన్నుమూశారు. సినీ ఇండస్ట్రీలో 38 ఏళ్ల ప్రయాణంలో 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు ప్రమోద్ కుమార్. వాటిల్లో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. అదే విధంగా కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రలు చేశారు. మోహన్‌బాబు హీరోగా 'దొంగ పోలీస్', 'గరం మసాలా' సినిమాలు నిర్మించారు ప్రమోద్ కుమార్. అలాగే 'సుబ్బయ్యగారి మేడ' పేరుతో ఓ చారిత్రక నవల రచించారు. తన సినీ అనుభవాలతో 'తెర వెనుక తెలుగు సినిమా' పేరుతో రాసిన పుస్తకం నంది పురస్కారానికి ఎంపికైంది. ప్రమోద్ కుమార్‌కి కొడుకు వి. శ్రీనివాస్ రాయ్, కుమార్తెలు వై. తులసి రాణి, జి. సరోజ ఉన్నారు. 'ఓ వ్యక్తిగా, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఆయన (ప్రమోద్) తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు' అన్నారు వి. శ్రీనివాస్ రాయ్.

భవిత

జాబ్ పాయింట్

నల్సార్ యూనివర్శిటీ, హైదరాబాద్‌లో 58 టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 58
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–10, అసోసియేట్ ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–12,అసిస్టెంట్‌ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్)–33, డైరెక్టర్(డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్)–01, హెడ్, కార్పొరేట్ ఇంటర్‌ఫేస్–01, ప్లేస్‌మెంట్ ఆఫీసర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, ఐజీడబ్ల్యూఏ, సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్/సెట్ అర్హతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2023.
» **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో 124 పోస్టులు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 124
» **పోస్టుల వివరాలు:** చీఫ్‌ఫైర్ ఆఫీసర్/ఎ–01, టెక్నికల్ ఆఫీసర్/సి(కంప్యూటర్స్) –03, డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్/ఎ–02, స్టేషన్ ఆఫీసర్/ఎ–07, సబ్–ఆఫీసర్ /బి–28, డ్రైవర్–కమ్–పంప్ ఆపరేటర్–కమ్ ఫైర్‌మ్యాన్/ఎ–83.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఖాళీలను అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, కమాండ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
» **వెబ్‌సైట్:** www.nfc.gov.in

స్పా విజయవాడలో 14 నాన్ టీచింగ్ పోస్టులు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఫైనాన్స్)–01, జూనియర్ సూపరింటెండెంట్–01, గ్రాఫిక్ డిజైనర్/సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01, వర్క్‌షాప్ సూపర్‌వైజర్/సూపరింటెండెంట్–01, జూనియర్ అసిస్టెంట్–09, హాస్టల్ అసిస్టెంట్/కేర్‌టేకర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** దరఖాస్తును నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఐటీఐ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **వెబ్‌సైట్:** www.spav.ac.in

మెదక్ జిల్లాలో ఫార్మసిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, మెదక్ జిల్లాలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** డీ ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.31,040 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతతో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును పోస్టులో లేదా వ్యక్తిగతంగా జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్‌నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.03.2023.
» **వెబ్‌సైట్:** www.medak.telangana.gov.in

నారాయణపేట జిల్లాలో 12 స్టాఫ్ నర్సు పోస్టులు

నారాయణపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ కింద నారాయణ పేట జిల్లాలోని పీహెచ్‌సీ/డీఎంహెచ్‌వోలలో ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.29,900 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎంలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, సింగారం ఎక్స్–రోడ్, నారాయణపేట చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2023.
» **వెబ్‌సైట్:** www.narayanpet.telangana.gov.in

సైన్స్‌లో బోధన,పరిశోధనలకు మార్గం.. సీఎస్ఐఆర్ నెట్

» సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ డిసెంబర్ 2022/జూన్ 2023 ప్రకటన
» ఈ స్కోర్‌తో జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత
» బ్యాచిలర్, పీజీ ఉతీర్ణులకు దరఖాస్తుకు అవకాశం


సీఎస్ఐఆర్-యూజీసీ నెట్

సైన్స్ పరిశోధనలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. బోధన రంగంలో రాణించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఒకే సమయంలో ఈ రెండు అవకాశాలను అందుకునేందుకు మార్గం.. సీఎస్ఐఆర్–యూజీసీ నెట్. ఈ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులు సీఎస్ఐఆర్ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన కేంద్రాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పరిశోధన సంస్థల్లో.. పీహెచ్‌డీ చేసేందుకు జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలో) లభిస్తుంది. అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.. ఇలా ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నారు.

అర్హతలు

- కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అర్హులు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులు సంబంధిత కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. బీఎస్సీ(హానర్స్) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. కానీ ఫైనల్ విద్యార్థులు/ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి అర్హత లేదు.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత లేదని పేర్కొన్నారు.

వయసు

జేఆర్ఎఫ్ అభ్యర్థులకు వయసు జూలై 1, 2022 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్,అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ద్వారా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) లభిస్తుంది. అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాధాన్యం జేఆర్ఎఫ్ లేదా లెక్చరర్‌షిప్ తెలియజేయాలి.
- ఫలితాల వెల్లడి సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం–కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే తొలి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున ఫెలోషిప్; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35వేల ఎస్ఆర్ఎఫ్(సీనియర్ ఫెలోషిప్) అందుతుంది.
- యూజీసీ మార్గదర్శకాల ప్రకారం–ఉన్నత విద్యా సంస్థల్లో లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత ప్రామాణికం.

పరీక్ష మూడు విభాగాలుగా

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష.. ఐదు సబ్జెక్టుల్లో మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. వివరాలు..

కెమికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	40	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	60	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

జాయింట్ సీఎస్ఐఆర్–యూజీసీ నెట్! ఇది కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. సంయుక్తంగా నిర్వహించే పరీక్ష!! ఇందులో అర్హత సాధిస్తే పీహెచ్‌డీలో చేరే అవకాశంతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. దీంతోపాటు బోధన రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. తాజాగా సీఎస్ఐఆర్–యూజీసీ నెట్–డిసెంబర్ 2022, జూన్–2023లకు ఉమ్మడి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, విజయం సాధిస్తే లభించే ప్రయోజనాలు తదితర వివరాలు..

ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓసియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	80	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

లైఫ్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	75	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

మ్యాథమెటికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	40	3	75
సి	సబ్జెక్ట్ పేపర్–2	60	4.75	95

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 25 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఫిజికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	25	3.5	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	30	5	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 20 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

విజయం సాధించాలంటే

పార్ట్–ఎ

ఇది అయిదు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పార్ట్–బి

ఈ విభాగంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

పార్ట్–సి

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షిస్తారు. పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో సమాధానాలను గుర్తించాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి.

పీజీ స్థాయి అవగాహన

సీఎస్ఐఆర్–యూజీసీ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. పార్ట్–సిలో రాణించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. పార్ట్–ఎలో అడిగే జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం


- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 12–18, 2023
- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తేదీలు: జూన్ 6, 7, 8, 2023
- వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in

సాక్షి
కర్నూలు
బుధవారం : 22 : మార్చి : 2023



ప్రేమను గెలిపించేందుకు..

ఆస్పరి: పిడకల సమరానికి మరోసారి కైరుప్పల గ్రామం వేదికగా నిలుస్తోంది. ఉగాది పర్వదినం మరుసటి రోజు గురువారం ఇరువర్గాల మధ్య నుగ్గులాట హోరాహోరీగా జరుగనుంది. -4లో



సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి 2,374 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	19.8
గరిష్టం	36.4

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

కర్నూలు(సెంట్రల్): శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాదిని ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ పి.కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ వారు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో వెలుగొందాలని, పల్లె సీమలు పాడి పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు.

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, భూగర్భ జలవనరుల శాఖ, గృహ నిర్మాణం, పశు సంవర్ధక శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, కేడీసీసీ బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లతో పాటు జిల్లాకు చెందిన పలు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు హాజరు కావాలని సీఈఓ కోరారు.

ఇంటర్‌లో 8 మంది డిబార్

కర్నూలు సిటీ: ఇంటర్ సెకెండ్ ఇయర్ పరీక్షల్లో 8 మంది డిబార్ అయ్యారు. మంగళవారం జిల్లాలోని 123 కేంద్రాల్లో 34,674 మంది విద్యార్థులకు గాను 33,479 మంది హాజరైనట్లు ఆర్ఐఓ గురవయ్య శెట్టి తెలిపారు. ఆదోని సాయి జూనియర్ కాలేజీలో ఒకరు, ప్రభుత్వ కాలేజీ 5 గురు, నారాయణ కాలేజీ (ఎమ్మిగనూరు)లో ఒకరు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ (ప్యాపిలి)లో ఒకరు డిబార్ అయినట్లు వెల్లడించారు.



ప్రభపై కొలువైన భ్రామరీ సమేత మల్లికార్జునుడు



భక్తజన సందోహం నడుమ స్వామి,అమ్మవార్ల ప్రభోత్సవం

ప్రభవించిన భక్తి

- మహాసరస్వతి అలంకారంలో కటాక్షించిన భ్రామరి
- సంప్రదాయబద్ధంగా వీరాచార విన్యాసాలు
- నేడు స్వామిఅమ్మవార్ల రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనేందుకు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. దీంతో శ్రీశైల క్షేత్రం కన్నడ భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్సవాల్లో మూడోరోజు మంగళవారం శ్రీ భ్రమరాంబాదేవి మహాసరస్వతి అలంకారంలో భక్తులకు కటాక్షించారు. శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి నందివాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు నిర్వహించిన ప్రభోత్సవం నేత్రానందభరితంగా సాగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీభ్రమరాంబాదేవిని మహాసరస్వతి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష అలంకార పూజలు చేపట్టారు. ఆతర్వాత ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు నందివాహనసేవ పూజలు చేపట్టి ఆలయ ఉత్సవాన్ని నిర్వహించారు. క్షేత్ర ప్రధాన వీధుల్లో నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కర్ణాటక జాంజ్, వీరగాసీ, కన్నడ జానపదడోలు, కోలాటం, చెక్కభజన, పగటి వేషాల ప్రదర్శన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్ముువాయిద్యాలు, నందికోలు నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నెను తీసుకువచ్చాయి. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ఏఈవోలు హరిదాసు, అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రానందభరితంగా ప్రభోత్సవం..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు స్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించారు. గంగాధర మండపం వద్ద వివిధ పుష్పాలతో అలంకరించిన ప్రభపై ఉత్సవమూర్తులను చేర్చి ప్రభోత్సవం నిర్వహించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు వేలాది మంది కన్నడ భక్తుల నీరాజనాల నడుమ ప్రభోత్సవం కన్నుల పండువగా సాగింది.



ఆలయ ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈఓ, అర్చకులు, అధికారులు

వీరాచార విన్యాసాలు..

అమావాస్య ఘడియలను పురస్కరించుకుని కర్ణాటక వీరశైవ భక్తులు అగ్నిగుండప్రవేశం, వీరాచార విన్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శివదీక్షా శిబిరాల వద్ద కార్యక్రమం కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరాచార సంప్రదాయాన్ని అనుసరించి జరిపే ఈ కార్యక్రమానికి ఎంతో విశిష్టత ఉంది. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ శూలాలు, తదితర అస్త్రాలను తమ చెంపల్లోకి, నాలుకలలోకి, పెదవుల్లోకి, కడుపులోకి, చేతులకు గుచ్చుకున్నారు. ప్రత్యేక వేషధారణలో వివిధ రకాల వాయిద్యాల నడుమ వారు చేసే ఈ విన్యాసాలతో భక్తులను గగుర్పాటుకు గురయ్యారు.

● చదువుల తల్లీ నమోస్తుతే..



ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు భ్రమరాంబాదేవి మహాసరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలు కలిగి ఉండి వీణ, అక్షరమాల పుస్తకాన్ని ధరించిన ఈ దేవిని దర్శించడం వలన విద్యాప్రాప్తితో పాటు అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. అలాగే నందివాహనాధీశులైన శ్రీస్వామి అమ్మవార్లను దర్శించడంతో చేపట్టే పనుల్లో విజయం లభిస్తుందని, భోగ భాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

● నేడు పంచాంగ శ్రవణం..

ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు దేవస్థాన అస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞతో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం స్వామిఅమ్మవార్లకు రథాంగహోమం, రథాంగపూజ, రథాంగబలిహరణలు చేపడుతారు. అనంతరం రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు.



గోరుముద్ద బలవర్ధకం





విద్యార్థినులకు రాగిజావ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, కలెక్టర్ కోటేశ్వరరావు, మేయర్ బీవై రామయ్య, హాజరైన విద్యార్థులు

- జగనన్న గోరుముద్ద ద్వారా రాగిజావ
- జిల్లాలో 1,463 పాఠశాలల్లో అమలు
- విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత
- అట్టహాసంగా రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

కర్నూలు సిటీ: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా బలవర్ధక ఆహారాన్ని అందిస్తోంది. ఇప్పుడు అదనంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగిజావ అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, డీఈఓ డా.వెంకటరంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీక్షించారు. అనంతరం బీక్యాంపు బాలికల ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,436 ప్రభుత్వ పాఠశాలల్లో 2.74 లక్షల మంది విద్యార్థులకు రాగి జావ అందించనున్నట్లు తెలిపారు. పిల్లలకు అవసరమైన ఐరన్, కాల్షియం తదితర పోషకాలు రాగిజావలోలభిస్తాయన్నారు. ఇప్పటికే గోరుముద్ద అమలులో 15 రకాల ఆహార పదార్థాలు, గుడ్లు, చిక్కీలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పిల్లల చదువుతో పాటు వారి ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గోరుముద్ద పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలవర్ధక ఆహారం అందిస్తున్నారన్నారు. ఎదిగే పిల్లల్లో రక్తహీనత, విటమిన్ లోపాలు ఉండకూడదని తాజాగా రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సర్కార్ స్కూళ్లలో కనీస సదుపాయాలు కూడా ఉండేవి కాదని, ఇప్పుడు ఏ స్కూల్ కెళ్లినా కార్పొరేట్ విద్యాసంస్థలను తలపిస్తున్నాయన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన దార్శనికుడు సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక మాట్లాడారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

రాగిజావ అదనంగా అందించడంపై ఉపాధ్యాయులు మహమ్మద్ మియా, ఇనాయతుల్లా రచించి పాడిన పాటకు విద్యార్థులు నృత్యం చేశారు. ఈ ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పాటపై కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, మేయర్, డీఈఓ తదితరులు ప్రశంసలు కురిపించారు. అనంతరం బీక్యాంపులోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉన్నతాధికారులు మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్, డీఈఓ ఆఫీస్ సూపరింటెండెంట్లు రాజశేఖర్, రవికుమార్, మధ్యాహ్న భోజన పథకం విభాగం సీనియర్ అసిస్టెంట్ రఘు, జనార్ధన్ పాల్గొన్నారు.

రాగిజావ చాలా బాగుంది



గతంలో మా స్కూల్‌లో బాత్‌రూంలు, తాగేందుకు నీరు ఉండేది కాదు. ఇప్పుడు మా స్కూలులో అన్ని వసతులు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం బాగుంది. చదువుకోవడానికి పాఠ్యపుస్తకాలు, నోట్స్, బ్యాగ్ ఇస్తున్నారు. వారానికి మూడు కోడిగుడ్లు, చిక్కీలు ఇస్తున్నారు. ఇప్పుడు అదనంగా రాగి జావ అందిస్తున్నారు. చాలా బాగుంది కూడా. – దయాన, 7వ తరగతి, బీక్యాంప్ మున్సిపల్ హైస్కూల్, కర్నూలు

27న ఆప్కాబ్ చైర్‌పర్సన్, ఎండీ రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు(ఆప్కాబ్) చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి ఈ నెల 27న నంద్యాల జిల్లాకు రానున్నారు. కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు రీజినల్ కార్యాలయాన్ని నంద్యాలలో వారు ప్రారంభించనున్నారు. జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఉమ్మడిగానే ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం రూ. 15 లక్షలతో నంద్యాలలో రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంతో పాటు నంద్యాల మండలంలో పోలూరు గ్రామంలో రూ.28 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని, భీమవరం గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ పంపును ప్రారంభిస్తారు. అలాగే గోస్పాడు మండలం యాల్లూరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను కూడా వారు ప్రారంభిస్తారని కేడీసీసీ బ్యాంకు అధికార వర్గాలు తెలిపాయి.

అర్చకులకు ఉగాది పురస్కారాలు

కర్నూలు కల్చరల్: దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించే పండితులు, అర్చకులకు ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది ఈ పురస్కారాలకు ముగ్గురు అర్చకులను ఎంపిక చేసినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు తెలిపారు. ఉగాది పర్వదినం రోజున వీరిని జిల్లా కలెక్టర్ సన్మానించి పురస్కారంతో పాటు రూ.10 వేలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. కర్నూలు పేట ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు జంగం శివలింగయ్య, గోనెగండ్ల మండలం వెంగోడు చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకుడు పూజరి సత్యనారాయణ స్వామి, పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామం గిడ్డాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు టి.నాగరాజు ఉగాది పురస్కారాలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

వినూత్న ప్రయత్నం..అద్భుత ఫలితం

- ఆముదం సాగులో దిబ్బమడుగు మద్దయ్య రాణింపు
- ఉత్తమ రైతుగా ఉగాది పురస్కారానికి ఎంపిక

కర్నూలు(అగ్రికల్చర్): ఆయన 7వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. వ్యవసాయంలో విశేషమైన ప్రతిభ కనబరిచారు. ఆముదంలో తక్కువ ఖర్చుతో గణనీయమైన దిగుబడులు సాధించి రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యాడు దిబ్బ మడుగు మద్దయ్య. ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లి పంచాయతీలోని చెన్నంచెట్టిపల్లి గ్రామానికి చెందిన ఈయన ఏటా వేరుశనగ,కంది, పత్తి వంటి పంటలు సాగు చేసేవారు. ఈ పంటలు కలసిరాకపోవడంతో వినూత్నంగా ఆలోచించాడు. మార్కెట్‌లో ఎటువంటి పంటలకు డిమాండ్ ఉందో తెలుసుకున్నాడు. ఆముదంలో సరికొత్త వంగడాలైన హైబ్రిడ్ రకాలను ఎంపిక చేసుకుని 2022–23లో పంట సాగు చేశాడు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా ఎకరాకు 5–6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈయన మాత్రం తక్కువ ఖర్చుతో రికార్డు స్థాయి దిగుబడులు సాధించారు. ఎకరాకు 8–10 క్వింటాళ్ల దిగుబడి సాధించడం విశేషం. ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ విష్ణువర్ధన్‌రెడ్డి పంట పొలాన్ని పరిశీలించారు. సాగు పద్ధతులను తెలుసుకుని ఆశ్చర్యపోయారు. తర్వాత వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా మేరకు మద్దయ్య ఉగాది పురస్కారానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల గుంటూరులోని ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పురస్కారానికి ఎంపికైనట్లు సమాచారం అందింది. దీంతో నేడు ఆ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారం , రూ.5వేలు నగదు బహుమతి అందుకోనున్నారు. ఆరుపదులకుపైగా వయస్సులో మద్దయ్య వ్యవసాయం చేస్తూ ఉత్తమ రైతుగా ఉగాది పురస్కారం అందుకుంటుండటంపై సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.


ఆముదం పంట పొలంలో దిబ్బమడుగు మద్దయ్య

ప్రేమను గెలిపించేందుకు..

- రేపు కైరుప్పలలో పిడకల సమరం
- అనాదిగా వస్తున్న సంప్రదాయం
- భారీగా తరలిరానున్న భక్తులు

ఆస్పరి: చాలా చోట్ల మనం ప్రేమను వ్యతిరేకించే, ప్రేమికులను విడగొట్టే పెద్దలను చూసుంటాం. అందుకు భిన్నంగా ప్రేమను గెలిపించేందుకు ఆ ఊరిలో యుద్ధం చేస్తారు. అందులో విజయం కూడా సాధిస్తారు. పిడకల సమరంగా పిలుచుకునే ఈ సంప్రదాయానికి కైరుప్పల గ్రామం మరోసారి సిద్ధమవుతోంది.

నేపథ్యమిదీ..

కైరుప్పల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి విహార యాత్రకు వెళ్లగా కాళికాదేవి తారస పడుతుంది. ఆమెతో ప్రేమలో పడి వివాహం చేసుకుంటానని మాట ఇస్తాడు. అయితే, ఆ తర్వాత స్వామి తన మాట తప్పడంతో కాళికాదేవి వర్గీయులకు తీవ్ర ఆగ్రహం వస్తుంది. వీరభద్రస్వామి, ఆయన వర్గీయులను అవమాన పరచాలని నిర్ణయించుకుని కాళికాదేవి వర్గీయులు తమకు అందుబాటులో ఉన్న పిడకల (పేడ)తో వారిపై దాడికి దిగుతారు. స్వామి వర్గీయులు కూడా అవే పిడకలతో ఎదురు దాడి చేస్తారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఈ పోరు రణరంగాన్ని తలపిస్తుంది. చివరకు గ్రామ పెద్దలు పంచాయితీ చేసి నిమ్న కులానికి చెందిన కాళికాదేవిని, అగ్రవర్ణానికి చెందిన వీరభద్రస్వామిని వివాహం చేశారని గ్రామస్తులు చెబుతారు. కాగా తమ ప్రేమను గెలిపించేందుకు ప్రాణాలకు తెగించి పోరాడిన తమ వర్గీయులకు వీరభద్రస్వామి, కాళికాదేవి కోరిన కోరికలు తీర్చారని పెద్దలు చెబుతారు. నాటి నుంచి ప్రతి ఏడాది వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉగాది పండుగ మరుసటి రోజు పిడకల సమరం (సంబరం)జరుపుకోవడం గ్రామంలో ఆనవాయితీగా వస్తుంది.

సమరం సాగుతుందిలా..

కోరిన కోరికలు నెరవేరితే స్వామికి భక్తులు నగలు,పట్టు వస్త్రాలు, కానుకలు సమర్పించడం సాధారణం. అయితే, అందుకు భిన్నంగా కైరుప్పల గ్రామంలో స్వామికి పిడకలు సమర్పిస్తారు. ఆచారం ప్రకారం పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి, అలారుదిన్నె, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి, బిల్లేకల్ తదితర గ్రామాల ప్రజలు ఒక నెల ముందు నుంచే ఇంటిలో ఉన్న పశువుల పేడతో పిడకలు తయారు చేసుకుంటారు. వాటిని ఉగాది మరుసటి రోజు దేవుడి సన్నిధికి చేరుస్తారు. పిడకల సమరానికి ముందు భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకుంటారు. దెబ్బలు తగలకుండా టవాళ్లతో ముసుగు వేసుకుంటారు. అరగంట పాటు జరిగే ఈ సమరంలో చాలా మంది భక్తులు గాయాలకు గురవుతారు. తర్వాత దెబ్బ తగిలిన చోట స్వామివారి బండారం రాసుకుని ఇంటి ముఖం పడతారు.


కైరుప్పలలోని వీరభద్రస్వామి ఆలయం

తరలిరానున్న భక్తులు

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పిడకల (నుగ్గులు) సమరం జరుగనుంది. ఈ వేడుకను తిలకించేందుకు మండలంలోని ఆస్పరి, కారుమంచి, బిల్లేకల్, చెన్నపల్లి, పుప్పాలదొడ్డి, యాటకల్, కలపరి, దొడగొండ, తురువగల్లు, అలారుదిన్నె, ముత్తుకూరు తదితర గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు.

ఉత్సవాల్లో కారుమంచి వంశస్తులు ప్రత్యేకం

స్వామి ఉత్సవాల్లో కారుమంచి పెద్దరెడ్డి వంశస్తులు రాచరికాన్ని గుర్తుకు తెస్తారు. ఈ వంశస్తుల్లో ఒకరు పిడకల సమరం రోజు శిరస్సున కిరీటం ధరించి ఖడ్గం చేతబూని షేర్వాణీ దుస్తుల్లో కారుమంచి నుంచి అశ్వంపై కైరుప్పల గ్రామానికి తన అనుచరులతో చేరుకుంటారు. కారుమంచి రెడ్డి వచ్చిన తర్వాత వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కారుమంచి వైపు వెళ్తాడు. తర్వాత పిడకల సమరం మొదలవుతుంది. పూర్వం కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్తులు ఆలయ అభివృద్ధికి కీలక పాత్ర పోషించడంతో ఇప్పటికీ ఆ కుటుంబానికి స్వామి ఉత్సవాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీ ఆవిష్కరణ


ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) డైరీని మంగళవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, గీతాంజలి నర్సింగ్ కళాశాలల అధినేత పెరుగు విజయవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యతతో ఉండటం శుభపరిణామన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే ఎప్పుడూ పోలీసు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం జర్నలిస్టు మిత్రులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు కె.బి.శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.హుసేన్, శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు బసప్ప, చంద్రమోహన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 149 కేంద్రాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు 149 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. మొత్తం 32,780 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ రంగారెడ్డి, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోడు రుణాలను మంజూరు చేయండి

జగనన్నతోడు 6వ విడతకు సంబంధించిన రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మీని కాన్ఫరెన్స్ హాలులో ఏపీజీబీ, ఎస్‌బీఐ బ్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు సంబంధించిన జగనన్నతోడు పథకానికి అర్హులైన వారందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. వచ్చిన దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని, తిరస్కరించవద్దని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఎల్‌డీఎం వెంకటనారాయణ, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు, చిత్రంలో నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ

వినియోగదారులను జాగృతం చేయండి

- ప్రసూనా 'లా' విద్యార్థులకు కమిషన్ సూచన

కర్నూలు(లీగల్): వినియోగదారులకు వారికున్న హక్కులపై జాగృతం చేయాలని న్యాయ విద్యార్థులకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సూచించింది. కోర్టు అబ్జర్వేషన్‌లో భాగంగా మంగళవారం ప్రసూనా న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జేపీ శివకుమార్ నేతృత్వంలో ఎల్‌ఎల్‌బీ ఫైనల్ విద్యార్థులు దాదాపు 150 మంది కమిషన్‌ను సందర్శించారు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటం చేయడంతో పాటు తమ పరిసరాల్లోని వారు కూడా అన్యాయానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయ విద్యార్థులపై ఉందని ప్రొఫెసర్ శివకుమార్ పేర్కొన్నారు. వినియోగదారులు అసౌకర్యానికి, సేవాలోపానికి, దోపిడీకి గురైనప్పుడు కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని 'ప్రసూనా' పూర్వ విద్యార్థి, కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్ కుమార్ సూచించారు. షాపింగ్ మాల్స్‌లో క్యారీ బ్యాగ్‌కు, సినిమా థియేటర్స్‌లో పార్కింగ్‌ను రుసుం వసూలు చేయడం చట్టవిరుద్ధమని ప్రసూనా కళాశాల పూర్వ అధ్యాపకులు, కమిషన్ సభ్యుడు ఎస్.నారాయణరెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యపై కమిషన్‌లో నేరుగా ఫిర్యాదు చేయడంతో పాటు వాదనలు వినిపించుకుని న్యాయం పొందవచ్చని కమిషన్ సభ్యులు నజీమా కౌసర్ సూచించారు. కార్యక్రమంలో ప్రసూనా న్యాయ కళాశాల అధ్యాపకులు మొహూజ్ పాషా, మహమ్మద్ హుసేన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు

చిరుధాన్యాల సాగుకు తొమ్మిది ప్రత్యేక క్లస్టర్లు

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ తొమ్మిది ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తోంది. మైనర్ మిల్లెట్స్‌లో కొర్ర, మేజర్ మిల్లెట్స్‌లో సజ్జ, జొన్న సాగును మరింత ప్రోత్సహించడం లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తుండటం విశేషం. 100 హెక్టార్లు ఒక క్లస్టరుగా గుర్తించారు. 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు, వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. హెక్టారుకు ప్రభుత్వం రూ.6వేల విలువ చేసే ఇన్‌పుట్స్ సరఫరా చేస్తుంది.

కొర్ర క్లస్టర్: కోడుమూరు, వెల్దుర్తి మండలం బోగోలు.

సజ్జ క్లస్టర్: ఆలూరు మండలం హొలేబీడు, మద్దికెర మండలం పెరవలి, దేవనకొండ, పత్తికొండ మండలం హోసూరు, తుగ్గలి మండలం రాతన.

జొన్న క్లస్టర్: హాలహర్వి, బల్లూరు.

మరింత పకడ్బందీగా ఉపాధి పనులు


ఓపెన్ ఫోరంలో రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు తావు లేకుండా మరింత కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాలకు సంబంధించి 16వ విడత సోషల్ ఆడిట్‌పై ఓపెన్ ఫోరం నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది మెటీరియల్, లేబర్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనుల్లో గుర్తించిన అవకతవకలు, తేడాలను వివరించారు. ఓర్వకల్లు మండలంలో 2021–22లో లేబర్ కాంపోనెంటు, మెటీరియల్ కింద రూ.12.50కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో రికవరీ రూ. 13,678 కాగా రూ.3.38 లక్షలు సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. గోనెగండ్ల మండలంలో వేజ్, మెటీరియల్ కింద రూ.9.61 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. ఇందులో రూ.12,563 రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రూ.84600 లక్షలు సర్దుబాటు చేశామన్నారు. గతంతో పోలిస్తే ఉపాధి పనుల్లో అక్రమాలు గణనీయంగా తగ్గినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి, వాటర్‌షెడ్ అదనపు పీడీ సలీమ్‌బాషా, ఏపీడీలు, అసిస్టెంటు విజిలెన్స్ ఆఫీసర్ పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ విభజన రాళ్ల ఏర్పాటు


సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు

పెద్దకడబూరు: సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో విభజన రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో మంగళవారం జరిగిన ఈకార్యక్రమాన్ని తహసీల్దారు వీరేంద్రగౌడ్ పరిశీలించారు. భవిష్యత్‌లో భూవివాదాలు ఉండకూడదని ప్రభుత్వం భూ సర్వే చేసి హద్దుల వద్ద రాళ్లు ఏర్పాటు చేస్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా 9 విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు

కృష్ణగిరి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.30కోట్లతో నూతనంగా 9 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఏపీఎస్‌పీడీసీఎల్ (ఆపరేషన్) ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సబ్‌స్టేషన్లలో మూడు జగనన్న కాలనీల్లో, ఒకటి టిడ్కో గృహసముదాయం వద్ద, మిగిలిన వ్యవసాయానికి సంబంధించి మంజూరు కావడం జరిగిందన్నారు. ఆదోని, నంద్యాల, ఆత్మకూరులోని జగనన్న కాలనీల్లో, కర్నూలు టిడ్కో, కృష్ణగిరి మండలం చిట్యాల, కోడుమూరు మండలం చిల్లబండ, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, పాణ్యం మండలం చిల్లకల్, రుద్రవరం మండలం నాగులవరం గ్రామాల్లో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట డోన్ డీఈఈ ప్రసాద్‌రెడ్డి, ఏడీ రమణారావు, ఏఈ మద్దిలేటి, వీఆర్వో అయ్యన్న, లైన్‌మెన్ ధనుంజయగౌడ్, నాయకులు లక్కసాగరం రాముడు, బసవరాజు ఉన్నారు.


చిట్యాల గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఉమాపతి